క్షణాలు నిమిషాలుగా రూపాంతరం చెంది కాలం ముందుకు కదులుతోంది.

అభిరాం కాఫీ తాగి టీపాయ్‌మీద కప్పుంచిన ధ్వనికి కళ్ళు తెరచి--

" అభిరాంగారూ! చిన్న విషయం" అన్నాడు వరప్రసాదం.

"ఏమిటో చెప్పండి" మామూలుగా అన్నాడు అభిరాం.

"మీకు మహదేవ్ అనే ఫ్రెండున్నాడా?" అడిగాడు.

"అవునూ' అయితే ఏం?" ఆశ్చర్యంగా అడిగాడు అభిరాం.

"ఏంలేదు! అపోలో హాస్పిటల్‌నుంచి ఆరున్నరకి మీకు ఫోనొచ్చింది ..... "

"ఏమని?" అతని మాటలు పూర్తికాక ముందే ఆందోళన నిండిన కంఠంతో అడిగాడు అభిరాం.

"అదే మీ ఫ్రెండ్ మహదేవ్‌గారికి ఏక్సిడెంట్ అయిందట. అపోలోలో ఎడ్మిట్ చేశారట. అతని షర్ట్‌జేబులో మీ విజిటింగ్ కార్డు వుంటే అందులో నెంబర్‌బట్టి మనకు ఫోనచేశారు.

"మరి వెంటనే నన్ను లేపి చెప్పకపోయారా?" కాస్త కోపం ధ్వనించింది అభిరాం కంఠంలో.

"సారీ ..... కేవలం విజిటింగ్ కార్డున్నంత మాత్రాన ఫ్రెండ్ అవ్వాలనేముంది. ఏ బిజినెస్ పర్పస్‌తోనో మీరాయనకి కార్డిచ్చి వుంటారు. అతను మీ స్నేహితుడు అయివుండడని అనుకున్నాను. పైగా రాత్రి బాగా ఆలస్యంగా నిద్రపోవటం వల్ల మీరు ఆదమరిచి నిద్రపోతుంటే లేపబుద్ధి కాలేదు."

"సర్లెండి" అంటూ గబగబా బట్టలు ధరించి అమ్మమ్మకి మాత్రం విషయం చెప్పకుండా బయలుదేరాడు.

"నన్ను కూడా రమ్మంటే వస్తాను" అన్నాడు వరప్రసాదం.

కాదనలేకపోయాడు అభిరాం. పైగా మరో మనిషి తోడు ఇటువంటి సమయంలో తప్పనిసరనిపించింది. దాంతో "రండి" అన్నాడు.

అప్పటికే లాల్చీ, పైజామాల్లో వున్న వరప్రసాదం అతన్ని అనుసరించాడు.

*  *  *  *  *

'సినిమాల్లో తప్ప నిజజీవితంలో కూడా కారునంత స్పీడుగా డ్రైవ్‌చేసే వాళ్ళుంటారా?" అనుకున్నాడు వరప్రసాదం అభిరాం డ్రైవింగ్ చూసి.

సరిగ్గా ఒకటిన్నర నిమిషంలో మూడు నాలుగు మలుపులు తిరిగి అపోలో హాస్పిటల్ ముందుకు చేరుకుంది కారు.

" మహదేవ్ అనే పేషెంట్ కావాలి. ఎర్లీ మార్నింగ్ ఏక్సిడెంట్ అయి జాయినై నతను" తనవంకే ప్రశ్నార్థకంగా చూసిన రిసెప్షనిస్ట్‌తో అన్నాడు అభిరాం.

అతను వివరాలు చెప్పగానే బాణంలా అటు వైపుకు దూసుకుపోయాడు.

వరప్రసాదం అతన్ని అనుసరించాడు.

అద్దాలతో నిండిన ఇంటెన్సివ్ కేర్‌లో నిస్తేజంగా పడివున్నాడు మహదేవ్.

అతని ఒంట్లోంచి చాలా రక్తం పోయిందన్నట్టు ఖాళీ అయిన ప్లాస్టిక్ బ్లడ్ యూనిట్‌ని మార్చి మరొకటి అమర్చింది నర్సు! మహదేవ్ తలకి కట్లు.

అభిరాం కళ్ళు అతనికి తెలియకనే చెమర్చాయి. వరప్రసాదం అతన్ని ఓదార్చాడు. మహదేవ్‌నీ ట్రీట్ చేస్తున్న డాక్టర్ దగ్గరికి నడిచాడు అభిరాం.

"ఎస్" హుందాగా అన్నాడతను.

"నా పేరు అభిరాం. మీరు ట్రీట్‌చేస్తున్న మహదేవ్ నా ప్రాణ స్నేహితుడు. అసలీ దారుణం ఎలా జరిగింది?"

అతని గొంతులో బాధనర్థం చేసుకున్నాడు డాక్టర్.

"సైనిక్‌పురి కాలనీ నుంచి సికిందరాబాద్ కెళ్ళే రోడ్డులో జరిగిందట ప్రమాదం. అప్పుడు సమయం ఆరు దగ్గర కావస్తుందట"

"ఎవరు చెప్పారు? అసలెవరు మహదేవ్ జాయిన్ చేశారు?" అడిగాడు అభిరాం.

"ఓ లారీ డ్రైవర్. అతని లారీకి కొన్ని గజాల దూరంలో వెళుతున్న ఆటో ప్రమాదానికి గురైతే డ్రైవర్, అందులోని పాసింజర్‌నీ.. అదే మీ ఫ్రెండ్ మహదేవ్‌ని, ఆటోడ్రైవర్నీ బాగా గాయాలైన పరిస్థితిలో తీసుకొచ్చాడు. అతనొక విషయం చెప్పాడు" ఏదో గుర్తొచ్చిన వాడిలా మధ్యలో ఆగి అన్నాడు.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు అభిరాం.

"తన లారీకి కొంత దూరంలో స్పీడుగా సాగిపోతున్న ఆటో ఒక్కసారే గాల్లో పైకిలేచి గింగిరీలు తిరుగుతూ పడిపోయిందట ..... "

"అదేమిటి? కొంపతీసి తానే ఏక్సిడెంట్ చేసేసి తప్పించుకోవటానికి కట్టుకథలల్లుతున్నాడా?" ఆశ్చర్యపోతూ అన్నాడు అభిరాం.

"నేనూ ముందలాగే ఆలోచించి ఎందుకయినా మంచిదని లారీ నెంబర్, అతని లైసెన్స్ నెంబర్ నోట్ చేసుకున్నాను. అయినా తనే ఏక్సిడెంట్ చేసి హాస్పిటల్‌కి తీసుకురాడుగా?" అన్నాడు డాక్టర్.

సాలోచనగా తలూపాడు అభిరాం.

"ఏదేమైనా పేషెంటులిద్దరూ తెలివిలోకి వస్తేకానీ అసలేం జరిగిందో జరిగిందో తెలుసుకోలేం" అన్నాడతను.

సరిగ్గా అప్పుడే సుడిగాలిలా దూసుకొచ్చిన నర్సు అంది-- "సార్! ఇంటెన్సివ్‌కేర్‌లోని పేషెంట్ పోయాడు. అదే ఉదయం ఎడ్మిటైనవాళ్ళల్లో ఒకతను."

"వ్వాట్?" అంటూ దిగ్గున లేచాడు డాక్టర్. పరుగులాంటి నడకతో బయటపడ్డాను.

నర్సు మాటలతో నవనాడులూ కృంగిపోయినట్లు అభిరాం కదల్లేకపోయాడు.

వరప్రసాదం మాత్రం త్వరత్వరగా బయటకు నడిచి మహదేవ్ వున్న వైపు చూశాడు.

అక్కడ డాక్టర్ కానీ, మరెవరు కానీ లేరు. అంటే పోయింది ఆటో డ్రైవరై వుంటాడు అని మరికొంచెం ముందుకు నడిచాడు. అక్కడ కనిపించారు ఇద్దరు డాక్టర్లు, ఓ నర్స్, ఓ ఆయా.

గబగబా వెనుదిరిగాడు వరప్రసాదం.

టేబుల్‌మీద తలుంచి నిశ్శబ్దంగా వున్న అభిరాం భుజంమీద చెయ్యేసి-- "పాపం ఆటోడ్రైవర్ పోయాడు. మహదేవ్ కులాసానే" అన్నాడు.

"నిజమా ..... ?" మహదేవ్‌కేమీ కాలేదన్న సంతోషం అతని మనసులో. ఇంతలో డాక్టర్ వచ్చాడు.

"మీ ఫ్రెండ్ విషయం కూడా ఇంకో ట్వెల్వ్ అవర్స్ వరకూ ఏం చెప్పలేం. ఆటోడ్రైవర్ పోయాడు" అని చెప్పాడు అభిరాంతో.

అభిరాం వాచ్ చూసుకున్నాడు. ఉదయం ఎనిమిదిన్నరయింది టైమ్. "అంటే సాయంత్రం ఎనిమిదిన్నర గంటల వరకూ మృత్యువుతో పోరాటం చేస్తాడు తన స్నేహితుడు మహదేవ్" అనుకున్నాడతను. అతనికి మనస్విని గుర్తొచ్చింది ..... మహదేవ్, మనస్విని ప్రేమ గుర్తొచ్చింది. "ఆమెకీ విషయం చెప్పాలా? వద్దా?" అనుకున్నాడు.

చెప్పకూడదనే చివరికి నిశ్చయించుకున్నాడు.

"అంతా బాగయ్యాక మామూలు గాయాలయ్యాయని చెప్పవచ్చు. ఇప్పుడే చెప్పేస్తే ఆమెనీ కంగారు పెట్టడం తప్ప ఉపయోగమేమీ వుండదు" అన్పించింది.

"మీ స్నేహితునికి బంధువులు, తల్లీదండ్రీ ఎవరూ లేరా?" అడిగాడు డాక్టర్.

"తల్లీ, చెల్లీ వున్నారు. తల్లి గుంటూరుకు దగ్గరలోని పల్లెటూరిలో వుంటుంది. చెల్లెలికి మ్యారేజ్ అయిపోయింది. అయినా ఎవరికీ ఏమీ చెప్పనవసరంలేదు. వాళ్ళని భయపెట్టటం తప్ప" అన్నాడు అభిరాం.

"నిజమే" అన్నట్టు తలూపాడు డాక్టర్.

అభిరాం, వరప్రసాదం బయటికి నడిచారు. విజిటర్స్ సోఫాలో వెనక్కి వాలి భారంగా కళ్ళు మూసుకున్నాడు అభిరాం. అతని పక్కనే కూర్చుని అతన్ని సముదాయిస్తున్నట్టు అతని భుజంమీద చెయ్యేసి నిమిరాడు వరప్రసాదం. సమయం నత్తనడక నడుస్తోంది.

అభిరాం గుండె వేగంగా కొట్టుకుంటోంది. వరప్రసాదం భావరహితంగా వుండిపోయాడు.

*   *   *   *   *

ఆ రోజు ఎందుకో మనస్విని అదోలా వుంది. మందు తిన్న కోయిల పాట పాడలేనట్టు, చినుకురాలక మయూరం నర్తించలేనట్టు.

అన్యమనస్కంగానే లేచి కాలకృత్యాలు తీర్చుకుంది. కాఫీ మాత్రం తాగింది. టిఫిన్ కూడా చేయబుద్ధికాలేదు. మహదేవ్ వాళ్ళమ్మకి తమ విషయం చెప్పటానికి వెళతానన్నాడు

..... అన్న విషయం గుర్తుకొచ్చి టైమ్ చూసింది. టేబుల్‌క్లాక్ ఉదయం ఏడున్నర చూపిస్తోంది సమయం.

ఆమెకెందుకో ఎప్పుడూ లేనంత నిస్సత్తువ ఆవరించింది. "మహదేవ్ తల్లి తమ పెళ్ళికి అంగీకరించదన్న అనుమానంతోనా" తనని తానే ప్రశ్నించుకుందామె. కాదు ..... ఇంకేదో కారణం. ఇదీ అని చెప్పలేని దిగులు ..... ఆ సమయంలో గుండెలో గుబులు చెప్పుకోవటానికి ఎవరయినా వుంటే బాగుణ్ణనిపిస్తుంది ఎవరికయినా. ఆమెకీ అలాగే అనిపించింది.

కానీ ముందునుంచి తన పనేదో తాను చేసుకుపోతూ ఎవరితోనూ కలవని తనకి ఎవరూ దగ్గరకాకపోవటం గుర్తొచ్చి భారంగా నిశ్వసించింది.

ఆఫీసుకి కూడా వెళ్ళబుద్ధి కాలేదు.

ఫోన్‌చేసి ఆ విషయం చెప్పాలని హాస్టల్ వార్డెన్ గదిలోకి నడిచింది. సినిమాల్లోనూ, తెలుగు నవలల్లోనూ వర్ణించినట్టు కాకుండా సౌమ్యంగా, హాస్టల్‌లోని వారందర్నీ ఓ పెద్ద దిక్కుగా ఆదరించే మేడమ్ ప్రమీలాదేవి మనస్విని తన గదికి రావటంతో కొద్దిగా ఆశ్చర్యపోయింది. ఎందుకంటే అతి అరుదుగా ఆమె తన గదికి వస్తుంది. అదీ ఎంతో ముఖ్యమయిన పనుంటేనే. మనస్విని నడవడిక, ఆమె ముక్కుసూటితనం ప్రమీలాదేవికి నచ్చుతాయి.

"ఒక ఫోన్ చేసుకుంటాను మేడమ్" వినయంగా అడిగింది మనస్విని.

"చేసుకోమ్మా" అందామె.

మనస్విని తన ఆఫీస్ నెంబర్ డయల్ చేసింది.

అట్నుంచి రింగవుతోంది కానీ ఎవరూ ఎత్తటంలేదు. ఫోన్ రింగవుతున్నంతసేపూ ఓపికగా ఎదురుచూసిందామె. లాభంలేకపోయింది.

ఎవరూ ఎత్తలేదు. ఫోన్ కట్టయిపోయింది. ఆమె రిసీవర్ క్రెడిల చేసి వెనుదిరగబోయింది.

"ఎక్కడికి చేశావమ్మ ఫోన్?" అడిగింది మేడమ్.

"ఆఫీస్‌కి" బదులిచ్చింది మనస్విని.

"మీ ఆఫీస్ ఎనిమిదింటికే మొదలైపోతుందా? మరి నువ్వు రోజూ ఇక్కడినుంచి వెళ్ళటమే ఎనిమిదిన్నరకి వెళతావ్" అనడిగిందామె.

అప్పుడు గుర్తుకొచ్చిందామెకి తమ ఆఫీస్ తొమ్మిదింటికి కదా అన్న విషయం.

"ఏమైందీ రోజు తనకి ..... తన ఆఫీస్ అవర్స్ సైతం మర్చిపోయేంతగా మెదడు మొద్దుబారిపోయిందా?" అని అనుకుందామె.

"కూర్చో మనస్వినీ" మార్దవంగా వుంది మేడమ్ కంఠస్వరం. మౌనంగా కూర్చుందామె.

మనస్విని మొహంలో ఏదో దిగులు గమనించగలిగింది ప్రమీలా దేవి.

"అమ్మా నాన్న గుర్తుకొచ్చారా?" లాలిస్తున్నట్లు అడిగిందామె.

లేదన్నట్టు తలూపింది మనస్విని.

"మరేమిటి ఈ రోజు దిగులుగా కనిపిస్తున్నావ్?"

మేడమ్ అలా అడిగేసరికి ఏం చెప్పాలో తెలీలేదామెకి. అసలు తనకంటూ తెలిస్తే కదా.

"ఏం లేదు మేడమ్. బాగానే వున్నా" అనేసింది.

'ఈ విషయంలో అమ్మాయిలైనా, అబ్బాయిలైనా యిలా దిగులుగా వుండి ఏమీ లేదంటున్నారంటే వాళ్ళు తప్పకుండా ప్రేమలో పడ్డట్లే! ప్రేమలో పడ్డవారికి సైతం చిన్న చిన్న ప్రణయకలహాలు తప్పవ్. అవే గోరంతలు కొండంతలుగా వూహించుకుని బెంబేలు పడిపోవడం, మరీ బలహీన మనస్కులు ఆత్మహత్యలు చేసుకోవటం కూడా తెలుసామెకు.

మనస్విని కూడా అదే స్థితిలో వుందేమో అనుకుందామె. సాధ్యమైనంతవరకూ ఆమెను తన మాటలలో ఊరడించాలనుకుంది. ఆమె మనస్సుని తను పడే బాధకి దూరంగా డైవర్ట్‌చేసి ఉపశాంతి లభింపజేయాలనుకుని మాటల్లో పెట్టింది.

"సృష్టికి మూలమైన స్త్రీ ..... అంటే మనమే ..... తెలుగులో స్త్రీని ఎన్నిరకాలుగా పిలుస్తారో తెలుసా నీకు?"

ముందు అర్థంకాలేదు మనస్వినికి. మేడమ్ తనని ఏమని అడిగారో!

ప్రమీలాదేవి అదే ప్రశ్న మళ్ళీ అడిగింది.

దాంతో మనస్విని మెదడు పొరలు కదిలిన భావన. ఎక్కడో చదివింది ..... అవును స్త్రీకి పర్యాయపదాలు ఇన్ని వుంటాయా అన్పించేటన్ని పదాల్ని తనెక్కడో చదివింది. మెల్లమెల్లగా ఆమె భావరహితమైన స్థితి నుంచీ, ఆందోళనా సుడిగుండాల నుంచీ బయటపడి మెదడు అందిస్తున్న సమాచారాన్ని అందుకోవటానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది-- ఏకాగ్రత కోసమన్నట్లు కళ్ళు మూసుకుంది.

ప్రమీలాదేవి మోముతో చిన్నగా దరహాసరేఖ. ఆమెని దిగులు దిగంతాలనుంచి ఈవలికి లాగగలిగానన్న సంతృప్తి.

ఇంతలో మనస్విని దొండపళ్ళు వంటి పెదాలు విచ్చుకున్నాయి. వరుసగా చెప్పసాగింది.

"అంగన, అతివ, ఆడది, ఇంతి, ఉవిద, కలికి, కళ్యాణి, కాంత, కొమ్మ, కోమలి, గాల, చాన, చెలువ, చేటి, చేడియ, చిగురుబోడి, జవ్వని, తన్వి, తరుణి, తెలువ, నాతి, నారి, నవల, నెలత, పడతి, ప్రమద. పెంటి, పైదలి, భామ, భామిని, మహిళ, మగువ, మానిని, ముదిత, ముగుద, మెలత, యువతి, యుగ్మలి, యోష, రత్న, రమణి, లలన, లలామ, లేమ, వనిత, వధూటి, వెలది, సుదతి, ఇండియానా.

"వెరీగుడ్" ఫస్టుమార్కులు తెచ్చుకున్న విద్యార్థిని మెచ్చుకునే టీచర్‌లా ప్రోత్సహించింది ప్రమీలాదేవి. మనస్వినికి మనస్సు తేలికైన భావన.